క్లుప్తంగా

రికార్డుల పరిశీలన



వ్యాధి నిరోధక టీకాల రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీనివాసులు

విడపనకల్లు: విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి పీహెచ్‌సీలను బుధవారం డబ్ల్యూహెచ్‌ఓ వ్యాధి నిరోధక టీకాల ఎక్స్‌టర్నల్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాలోప్స్ టీకాలు అందుతున్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకాల రికార్డులు సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది శర్మాస్‌వలి, నాగశంకర్, మునెమ్మ, సచివాలయ ఏఎన్‌ఎం శ్రావణి పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ పాత్రికేయుడి మృతి



నాగన్న (ఫైల్)

వజ్రకరూరు: మండల పరిధిలోని గూళ్య పాళ్యం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు సి.నాగన్న (52) అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మండలానికి చెందిన పాత్రికేయులు నాగన్న మృతదేహానికి నివాళులర్పించారు. పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాకెట్ల అశోక్, ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు లాయర్ ఉమాపతి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రాచన్నగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, బూత్‌స్థాయి అధ్యక్షుడు ఓబులేసు, సర్పంచు కురుబ లక్ష్మయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గడ్డివాముల దగ్ధం

ఉరవకొండ: మండల పరిధిలోని బూదగవి గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే రైతుకు చెందిన గడ్డివాములకు బుధవారం ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. గ్రామస్తులు వెంటనే ఉరవకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగయ్య సిబ్బందితో కలసి గ్రామానికి వెళ్లి మంటలను ఆర్పేశారు. రూ.30 వేల విలువ చేసే వరి గడ్డి కాలిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజీ సూచించారు. మండల పరిధిలోని సీబావి, బోరంపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. రోజుకు ఎంత మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు? రోజువారి కూలీ ఎంత పడుతోందని అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ ఓబిరెడ్డి, ఈసీ, టీఏ, ఎఫ్‌ఏలతో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఈసీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనిల్, మమత, ఫీల్డ్ అసిస్టెంట్ ఇందిర పాల్గొన్నారు.

మామిడి చెట్ల దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదాల్లో మామిడి చెట్లు కాలిపోయాయి. భట్టువానిపల్లి గ్రామ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు తిమ్మరాయుడుకు చెందిన 20 మామిడి చెట్లు, 30 చింతచెట్లు దగ్ధమయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన శ్రీరాములు అనే రైతుకు చెందిన వంద మామిడి చెట్లు అగ్ని ప్రమాదంలో కాలిపోగా రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. మల్లిపల్లి గ్రామంలో తిమ్మప్పకు చెందిన మామిడి తోటలో 20 చెట్లు అగ్నిప్రమాదంలో కాలిపోగా.. రూ.30 వేల దాకా నష్టం వాటిల్లింది. కళ్యాణదుర్గం, రాయదుర్గం అగ్నిమాపక కేంద్రాల వాహనాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

కూడేరు: తాగునీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పాతిమాకు ఎంపీపీ నారాయణ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని శివరాంపేట వద్ద ఉరవకొండ తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఉదిరిపికొండ తండాకు నీటి సరఫరా కావడం లేదు. పూర్తి స్థాయిలో లీకేజీకి మరమ్మతులు చేయించి ఉదిరిపికొండ తండాకు నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో రారాజులు

- 12 ఏళ్లుగా ప్రమాద రహిత డ్రైవర్లుగా అవార్డులు
- ఉరవకొండ డిపోకు ప్రత్యేక గుర్తింపు



ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు అందజేస్తున్న ఉరవకొండ డిపో అధికారులు (ఫైల్)

ఉరవకొండ: ఆర్టీసీ డ్రైవర్లు మిగతా వాహనాల డ్రైవర్ల కంటే అప్రమత్తంగా ఉండాలి. బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉంటారు. ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా ప్రయాణిస్తున్న కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రమాదాలు జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమన్న భావనను నిజం చేస్తూ.. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ 25 ఏళ్లుగా ఏ చిన్న ప్రమాదం జరగనివ్వకుండా బస్సులు నడుపుతున్నారు ఓ ముగ్గురు డ్రైవర్లు. ప్రమాద రహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకుంటూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలో పని చేస్తున్న డ్రైవర్లు అన్నం వెంకటేశులు, బీఎల్ నారాయణ, పి.బాషా. 2012 నుంచి 2023 వరకూ 12 ఏళ్లుగా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఉత్తమ డ్రైవర్లుగా నిలుస్తూ అవార్డులు కైవసం చేసుకోవడం విశేషం. డ్రైవర్లందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఈ ముగ్గురు డ్రైవర్లపై కథనం మీకోసం..

ప్రయాణికుల భద్రతే ముఖ్యం



1991లో ఆర్టీసీలో డ్రైవర్‌గా విధుల్లో చేరాను. ఇప్పటి వరకూ ఒక్క ప్రమాదం లేకుండా బస్సు నడుపుతున్నాను. 12 సార్లు ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు స్వీకరించాను. ముఖ్యంగా నిర్దేశించిన సమయం కంటే ముందే డిపోకు చేరుకుంటాను. బస్సు కండిషన్‌లో ఉందో లేదో చూసుకోవడం అలవాటుగా మారింది.

– వెంకటేష్, డ్రైవర్, ఉరవకొండ

ప్రశాంతంగా ఉండాలి..



బస్సు నడిపేటప్పుడు ఏ ఆలోచనలు పెట్టుకోకూడదు. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరుగుతాయి. నేను 1992లో ఆర్టీసీలో డ్రైవర్‌గా చేరినప్పటి నుంచి ఒక్క ప్రమాదం చేయలేదు. దాదాపు 10 సార్లు ఉత్తమ డ్రైవరుగా అవార్డులు తీసుకున్నాను. విధులకు వెళ్లే సమయంలో ప్రశాంతంగా ఉంటాను.

– పి.బాషా, డ్రైవర్, ఉరవకొండ

సమయస్ఫూర్తితో వ్యవహరిస్తాను



ప్రయాణికులను నా కుటుంబ సభ్యులుగా భావిస్తూ నడపడం అలవాటు చేసుకున్నాను. 1996లో డ్రైవర్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి ఒక్క ప్రమాదం కుడా చేయలేదు. వాహనం నడిపేటప్పుడు సమయస్ఫూర్తి పాటించడంతో పాటు నిబంధనలు పాటిస్తాను. డిపో అధికారులు చేసే సూచనలు మననం చేసుకుంటూ ముందుకు సాగుతాను.

– నారాయణ, డ్రైవర్, ఉరవకొండ

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

ఉరవకొండ: జలజీవన్ మిషన్ పథకం ద్వారా పట్టణంలో రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులను బుధవారం ఎంపీపీ చందాచంద్రమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో పట్టణంలో 90 శాతం తాగునీటి సమస్య తీరనుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.3 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. పనులు మరింత వేగవంతం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శర్మాస్, షేక్షావలి, బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



మృతుడి భార్యకు సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహళ్: మండల పరిధిలోని దుద్దేకుంటలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన డ్రైవర్ తిప్పయ్య (49) కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేల తక్షణసాయాన్ని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి రత్నమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి రామాంజినేయులు, ఎంపీపీ పెద్దన్న పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

కంబదూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఆదివారం అచ్చంపల్లి గ్రామంలో టీడీపీ నేతలు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, టీడీపీ జెండాను కట్టి యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. దీనిపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'అచ్చంపల్లిలో కోడ్ ఉల్లంఘన'పై కథనం వెలువడింది. స్పందించిన ఎంపీడీఓ ఆంజనేయులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన టీడీపీ నేతలపై బుధవారం కంబదూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చౌళం మల్లికార్జున, కన్వీనర్ శివన్న, కంబదూరు మాజీ సర్పంచ్ శ్రీరాములు, తెలుగు యువత నాయకుడు గుద్దెళ్ల హరి, నాయకులు డీకే రామాంజినేయులు, ఆవుల తిప్పేస్వామి, పాపంపల్లి రామాంజినేయులు, దండా వెంకటేశులు, బాబయ్య, తలారి సత్తి, తిమ్మరాయుడు, నాగరాజు, రజినీ, గంగిరెడ్డిపై ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేశారు. మరికొంత మందిని కూడా గుర్తించి కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు

బొమ్మనహళ్: ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ శివతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఎక్కడా అసౌకర్యాలు కలగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర వసతులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. సౌకర్యాల కల్పన, ఇతరాత్ర విషయాలపై అధికారులు చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సీఐ యుగంధర్, ఎంఈఓ నాగమణి, డీటీ రఘు, ఎస్‌ఐ సుమన్ పాల్గొన్నారు.

వెన్నపూసను గెలిపించాలి



ఉరవకొండలోని జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఉరవకొండ: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలు, పాఠశాలల్లో ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసు, ఉప సర్పంచ్ వన్నప్ప పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలి..

కళ్యాణదుర్గం: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యర్థించారు. మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సహకారంతో బుధవారం ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు వెన్నపూస సంజీవరెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ భట్టువానిపల్లి ఆంజనేయులు, వక్ఫ్‌బోర్డు సభ్యుడు షేక్షావలితో కలిసి మండల పరిషత్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, తహసీల్దార్, హౌసింగ్ తదితర కార్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 2024 ఎన్నికలకు ఇవి రెఫరెండం కానున్నాయన్నారు. గ్రామస్థాయి నుంచే ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, దూదేపీరా, ఆంజినేయులు, రవితేజ, ఈశ్వర్ నాయక్, వీరా, సోము పాల్గొన్నారు.

మహిళలకు విరివిగా రుణాలు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం నాగరాజ రెడ్డి

కళ్యాణదుర్గం: గ్రామైక్య సంఘాల్లో ఉన్న మహిళలకు విరివిగా రుణాలు అందించి, వారిని ఆర్థిక పరిపుష్టి వైపు నడిపించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) నాగరాజ రెడ్డి అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం జెఎంఎల్‌బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ జీవీఆర్ మోహన్‌తో కలిసి మహిళా సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకుల ద్వారా మహిళలు తీసుకున్న రుణాలు, రికవరీ, జగనన్న తోడు రుణాలు, రైతుల పంట రుణాలపై ఆరా తీశారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తే రాబోవు రోజుల్లో మరింతగా ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లైవ్‌లీ హుడ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి, బ్యాంక్ లింకేజీ డీపీఎం రవీంద్రబాబు, ఉన్నతి ఏపీఎం సుభద్రమ్మ, ఇతర బ్యాంక్‌ల అధికారులు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు వరం 'విద్యుత్ అదాలత్'



ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: వినియోగదారులకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ వరమని అదాలత్ పరిష్కార వేదిక అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ ఫైనాన్స్ సభ్యుడు రామమోహన్ రావు అన్నారు. పట్టణంలోని ఏపీ దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యుడు జి.ఈశ్వరయ్య తదితరులు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్దేహాళ్ ప్రాంతానికి చెందిన ఓ రైతు తనకు తనకు కరెంటు బిల్లు అధికంగా వస్తుందని చెప్పడంతో వెంటనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా పట్టణానికి చెందిన ఓ వినియోగదారుడు తన కంకర మిషన్‌కు హెచ్‌టీ సామర్థ్యం నుంచి ఎల్‌టీ సామర్థ్యం కనెక్షన్ మార్చాలని విన్నవించాడు. కణేకల్లు ప్రాంతంలో హెచ్‌వీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో ఓ ప్రైవేట్ వ్యక్తి రైతుల వద్ద నుంచి రూ.50 వేల వరకు డబ్బు వసూళ్లు చేసినట్లు రైతులు ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు ప్రైవేట్ వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, రైతులకు డబ్బులు ఇప్పించాలని అధికారులు ఆదేశించారు. వేసవి సమీపిస్తుండటంతో లో ఓల్టేజ్ సమస్యను తీర్చాలని కుందుర్పి, శెట్టూరు ప్రాంతాలకు చెందిన రైతులు అధికారులను కోరారు. వీటన్నింటినీ త్వరతగతిన పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి

బ్రహ్మసముద్రం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీడీఓ వెంకట్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు నివేదికలను వివరించారు. సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పాలంటూ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, వైస్ ఎంపీపీ సునందమ్మ, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, ఉపాధి ఏపీఓ అప్పస్వామి , పశువైద్యాధికారి సూర్యనారాయణ, ఎంఈఓ ఓబుళపతి, ఏఓ సరిత, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సుబ్బరాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మంజునాథ, సర్పంచులు పూజ, అంజినమ్మ, గంగమ్మ, గోవిందప్ప ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీలు నగేష్, నరసింహ, మారుతమ్మ, సువర్ణమ్మ, నాగలక్ష్మి, వరలక్ష్మి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడికి సన్మానం

కణేకల్లు: స్థానిక ఫిషరీస్ భవన్‌లో బుధవారం వక్ఫ్ బోర్డు సభ్యుడిగా నియమితులైన మాబుపీరాకు మైనార్టీలు సన్మానసభ నిర్వహించారు. వైస్ సర్పంచు, కణేకల్లు పంచాయతీ సభ్యుడిగా ప్రజలకు ఏన్నో సేవలందించిన మాబుపీరా మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ నబీసా, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, మాబు, కాంట్రాక్టర్ ఖలందర్, పెద్దదేవర ఖలందర్, సయ్యద్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెన్న, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

విడపనకల్లు: మండల కేంద్రంలో బుధవారం విడపనకల్లు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత భరత్ రెడ్డి, యువనేత దేశాయ్ సిద్దార్థ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు ప్రారంభించారు. మార్చి 15వ తేదీ వరకూ జరిగే టోర్నమెంట్‌లో 56 జట్లు తలపడుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ భీంరెడ్డి పాల్గొన్నారు.

భూములను కాపాడాలి

విడపనకల్లు: మండల కేంద్రంలో ఆక్రమణదారుల నుంచి గ్రామకంఠం భూమిని కాపాడాలని తహసీల్దారు బ్రహ్మయ్యను ఎంపీపీ కరణం పుష్పావతి కోరారు. సర్వే నంబర్ 532లో ఉన్న దాదాపు 15 సెంట్లు గ్రామకంఠం భూమిని రాచన్నగారి తిమ్మప్ప, రాచన్నగారి రామాంజినేయులు, రాచన్నగారి గోవిందు ఆక్రమించుకుని షెడ్డు వేసుకున్నారన్నారు. 2020లో రెవెన్యూ అధికారుల నుంచి పొజిషన్ సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. తహసీల్దారు బ్రహ్మయ్య స్పందిస్తూ.. విచారణ చేయించి విడపనకల్లులో ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచు భీంరెడ్డి, నాయకులు గిరిబాబు, పవన్ కుమార్, సత్తి, హేమంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కళ్యాణదుర్గం: అనుభవం గల అధ్యాపకులతో నాణ్యమైన బోధన అందిస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, సురేష్, వెంకటేష్ బాబు అన్నారు. అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం పాపంపల్లి, చిన్నంపల్లి, చెర్లోపల్లి, లక్ష్మంపల్లి, బచ్చేహళ్లితో పాటు పలు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ జనరల్ గ్రూప్‌లతో పాటు వృత్తి విద్యా కోర్సులైన ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్సు, ల్యాబ్ టెక్నిషియన్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (నర్సింగ్, సెరికల్చర్ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. నాడు–నేడు పథకం ద్వారా అదనపు గదులు, మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, రన్నింగ్ వాటర్ టాయిలెట్స్, సురక్షిత మంచినీటి సౌకర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కళాశాల ఉందన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

విడపనకల్లు: విడపనకల్లులో ఆర్.కొట్టాలకు వెళ్లే క్రాస్‌లో ఉన్న సినిమా హాల్‌లో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, ఎంపీపీ పుష్పావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, యువనేత ప్రణయ్‌రెడ్డి హాజరవుతారాన్నరు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రాజశేఖర్‌రెడ్డి జిన్నాలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమావత్ దేవి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రాచన్నగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు హాజరవుతారన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం

బొమ్మనహళ్: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని, 175 స్థానాల్లో విజయం సాధించి చరిత్ర సృష్టిస్తుందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, సచివాలయాల మండల కన్వీనర్ దుద్దేకుంట రామాంజినేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బొమ్మనహళ్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఈనెల 17న ఉదయం 9:30 గంటలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్, యువనేత ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ ఇన్‌చార్జ్‌లతో సమావేశం జరగుతుందన్నారు. మండల వ్యాప్తంగా గృహసారథులు, సచివాలయల కన్వీనర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు మచ్చన్న, కరుణాకర్, రమేష్, పూలప్రసాద్, తిమ్మారెడ్డి, వెంకటరెడ్డి, హనమంతరాయుడు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీది మీరే మాట్లాడితే మేమెందుకు?

- విసుగు పుట్టించిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుల తీరు
- ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు



అధికారుల ప్రసంగాలకు అడ్డుగా వస్తున్న టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు నరేంద్ర

కణేకల్లు: ప్రతీది తప్పుబట్టడం.. సమస్యలన్నీ మా ఊళ్లోనే ఉన్నాయన్నట్లు టీడీపీ సభ్యులు వ్యవహరించిన తీరు అందరికీ విసుగు తెప్పించింది. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎస్.హనుమాపురం ఎంపీటీసీ నరేంద్ర, సర్పంచు జయరాంచౌదరి మరొకరికి అవకాశం ఇవ్వకుండా అధికారుల ప్రసంగానికి అడ్డుతగిలారు. మా ఊళ్లో ఆ పనులెందుకు చేయలేదు.. ఇవెందుకు చేయలేదంటూ రచ్చ చేయాలనుకున్న టీడీపీ సభ్యులపై వైఎస్సార్‌సీపీ సభ్యులు తిరగబడ్డారు. ప్రతీది మీరే మాట్లాడితే ఇక మేమంతా ఎందుకు? సమయమంతా మీకే కావాలా? ఇతరులు మాట్లాడాలా వద్దా! అంటూ వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత సేపటికీ గొడవ సద్దుమణగకపోవడంతో తహసీల్దార్ రజాక్‌వలీ ఎస్‌ఐ దుగ్గిరెడ్డికి ఫోన్ చేశారు. ఎస్‌ఐతోపాటు పోలీసులు కూడా సభలోకి రావడంతో టీడీపీ సభ్యులు నోరు మెదపకుండా మౌనంగా ఉండిపోయారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ప్రజాప్రతినిధులకు ఎంపీడీఓ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జగనన్న గోరుముద్దతోపాటు ఇతర పౌష్టికాహారాలను సరఫరా చేస్తోందన్నారు. కేంద్రాలను విజిట్ చేసి సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలకు వెళ్లి, మధ్యాహ్న భోజనాన్ని కూడా తరచూ పరిశీలించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లీలావతి, పీఆర్‌జేఈ చెంచయ్య, వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి దస్తగిరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ: ముగ్గురికి గాయాలు





చికిత్స పొందుతున్న ధనంజి, నిర్మలమ్మ

శెట్టూరు: మండల పరిధిలోని కంబాలపల్లి వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాలు.. కళ్యాణదుర్గం మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన ధనంజి, భార్య నిర్మలమ్మ, పాప హర్షిణి ముగ్గురూ లక్ష్మంపల్లి నుంచి కుందుర్పి వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. కంబాలపల్లి వద్దకు చేరుకోగానే.. ఎదురుగా వస్తుస్తున్న మరొక ద్విచక్ర వాహనం వీరిని ఢీకొట్టింది. గాయపడిన ధనంజి, భార్య నిర్మలమ్మ, పాప హర్షిణిని అటుగా వస్తున్న ప్రయాణికులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు.

చింత ఫలసాయం వేలం

రాయదుర్గం రూరల్: స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం మండలంలోని పల్లేపల్లి గ్రామ పరిధిలోని చింతచెట్లను వేలం వేశారు. వెంకటేశులు రూ.11 వేలకు చింతచెట్లను దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు తెలిపారు.

